పైసల్ రాక పరేషాన్

- మధ్యాహ్న భోజన కార్మికులకు అందని బిల్లులు
- ఐదారు నెలలుగా ఇబ్బంది పడుతున్న వైనం
- నెలనెలా వంట చేసేందుకు అప్పులు
- పలు పాఠశాలల్లో వంట గదులకు మరమ్మతు కరువు



సుందరగిరి జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మహిళలు



కట్టెల పొయ్యిమీద వంట చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

చిగురుమామిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నుంచి రూ.ఆరులక్షల బిల్లులు రావాల్సి ఉంది. దీంతో విద్యార్థులకు ప్రతి రోజు వంట చేసేందుకు చేతిలో చిల్లి గవ్వలేక అప్పులు చేస్తున్నారు. మండలంలో 36 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 10 జెడ్పీ, 1 కేజీబీవీ, 4 ప్రాథమికోన్నత, 21 ప్రాథమిక పాఠశాలలున్నాయి. పాఠశాలల్లో ఒకతో తరగతి నుంచి పదోతరగతి వరకు 2,615 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన డబ్బులు చెల్లిస్తుండటా రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు డబ్బులు చెల్లిస్తోంది. ఒకటి తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రోజుకు భోజన ఖర్చుల కింద ఐదు రూపాయల నలభై ఐదుపైసలు, ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎనిమిది రూపాయల పదిహేడు పైసలు, అలాగే తొమ్మిది నుంచి పదో తరగతి విద్యార్థులకు పది రూపాయల అరవైఏడు పైసలు ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయి. కోడిగుడ్డుకు ఐదు రూపాయల చొప్పున జూలై వరకు చెల్లించారు. అప్పటి నుంచి డిసెంబర్ 31 వరకు బకాయి రావాల్సి ఉంది.

రూ. ఆరు లక్షల వరకు బిల్లులు

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యార్థులకు గతేడాది ఆగస్టు నుంచి నవంబర్ వరకు రూ.ఆరు లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. డిసెంబర్ కూడా గడిచిపోయింది. ఈనెలకు సంబంధించిన బిల్లు చెల్లించాల్సి ఉంది. కిరాణం దుకాణాల్లో అప్పులు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారు. 1–8వ తరగతి విద్యార్థులకు గతేడాది ఆగస్టు నుంచి నవంబర్ వరకు కేంద్ర ప్రభుత్వం బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. తొమ్మిది పదో తరగతి విద్యార్థులకు అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. రెండు ప్రభుత్వాల నుంచి బిల్లులు సకాలంలో రాక మధ్యాహ్న భోజన కార్మికులు నలిగిపోతున్నారు. చాలీచాలని వేతనంతో వంట వండలేక, పని వదలలేక జీవనం సాగిస్తున్నారు. బయట పనులకు వెళ్తున్న మహిళలు రోజూ రూ.మూడు నుంచి నాలుగు వందల వరకు సంపాదిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం వండే కార్మికులు మాత్రం రోజుకు కనీసం వంద రూపాయలు అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, అలాగే కేంద్ర ప్రభుత్వం కార్మికుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని డబ్బులు విడుదల చేయాలని కోరుతున్నారు.

వంట గదులు లేక ఇబ్బందులు

ఒకవైపు బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు వంట గదులు సరిగా లేక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు కొండాపూర్, గాగిరెడ్డిపల్లి, ఓగులాపూర్, బొమ్మనపల్లి, చిగురుమామిడి, పీచుపల్లి, ముదిమాణిక్యం, కాళవాడ కొండాపూర్, ఎక్స్‌రోడ్ కొండాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో వంట గదులు మేజర్ రిపేర్‌లో ఉన్నాయి. కొన్నేళ్లుగా ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా మరమ్మతుకు నోచుకోవడం లేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు అంటున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు రావడంలేదు. చేతిలో చిల్లి గవ్వలేదు. కిరాణ సామాను తెచ్చేందుకు ఇబ్బందిగా ఉంది. బిల్లులు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. బయట పనికిపోతే రోజుకూలీ వచ్చేది.

– ఎనగందుల లక్ష్మి, జెడ్పీ పాఠశాల, సుందరగిరి

ఏం లాభం లేదు



బడిలో వంట చేస్తే ఏంలాభంలేదు. అప్పులవుతున్నయ్..సార్లు బిల్లులు ఇగస్తయ్, అగస్తయ్ అంటున్నారు. నెలరోజులు కిరాణ సామాను, కూరగాయలు తెచ్చిపెడితే బిల్లులు ఎప్పుడో వస్తాయో అని ఎదురుచూడాలే. బతకడం కష్టంగా ఉంది.

– సీహెచ్ సరవ్వ, ఎంపీపీఎస్ ముదిమాణిక్యం

ప్రతిపాదనలు పంపాం



మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. ఆరు లక్షల బకాయి రావాలి. ప్రభుత్వానికి బిల్లులు చేసి పంపాం. రాగానే ఖాతాల్లో జమచేస్తాం. వంటగదుల మరమ్మతు కోసం ఉన్నతాధికారులకు, గత ఎమ్మెల్యేకు కూడా ప్రతిపాదనలు పంపించాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ, చిగురుమామిడి

క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న వంశీకృష్ణ

వీణవంక: వీణవంక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణను మండలంలోని పలువురు నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పెద్ది మల్లారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు ఎనగంటి శ్రీనివాస్, ఎండీ అఖిల్‌పాషా, మతిన్ తదితరులు ఉన్నారు.

తిమ్మాపూర్ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా వంశీ



వంశీని సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం తిమ్మాపూర్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈమేరకు సంఘం నాయకులు సమావేశమై నూతన అధ్యక్షుడిగా బొర్ర వంశీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వంశీ ఓటేసిన సంఘం సభ్యులకు కతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి , అంబేడ్కర్ ఆలోచన, అడుగుజాడల్లో నడవడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాతంగి లక్ష్మణ్, శంకర్, అశోక్, రమేష్, మల్లయ్య, బొర్ర రవి, నగునూరి బాపు, రాజు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

సత్యోత్సవం

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో సత్యోత్సవం పేరుతో ఘనంగా వార్షిక వేడుకలు నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, పారమిత, ఎక్స్‌ప్లోరికా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యమేవ జయతే అనే అంశం ఆధారంగా జరిగిన సత్యోత్సవం అనే ఈ వార్షికోత్సవంలో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. ఈ విద్యాసంవత్సరం స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులుడా.ఇ.ప్రసాద్‌రావు అందజేశారు. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన కనకం వెంకటస్వామిని చల్లూరు గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి కులం పేరుతో దూషించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వెంకటస్వామి ఇంటి నిర్మాణం చేపడుతుండగా తిరుపతితో పాటు కొంత మంది వచ్చి భూమి నాదని కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు చేశాడని తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డబ్బులు వసూల్..

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు ఇసుక లారీలను ఆపి డబ్బులు వసూల్ చేస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో ఇసుక లారీలు ఢీకొని గ్రామానికి చెందిన వారు చనిపోతే కనీసం అడ్డుకోలేదని, ఇప్పుడు ఎందుకు వసూల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సర్పంచ్ భర్తనే లారీల వద్ద వసూల్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పరామర్శ



హుజూరాబాద్: పట్టణానికి చెందిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్, సామాజిక ఉద్యమకారుడు పల్కల ఈశ్వర్‌రెడ్డిని ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు ఆదివారం పరామర్శించారు. పది రోజుల క్రితం హైదరాబాద్‌లో ఈశ్వర్‌రెడ్డి గొంతుకు ఆపరేషన్‌కాగా శనివారం స్వగృహానికి చేరుకున్నారు. ఈ మేరకు ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో మల్లయ్య, రత్నం, వెంకటరాజం, సదానందం, రాజు, సమ్మయ్య, ప్రభాకర్, భిక్షపతి, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మలిదశ తెలంగాణ ఉద్యమకారులు సయ్యద్ నయీమ్ రూపొందించిన క్యాలెండర్‌ను మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ ఆదివారం మల్టీప్లెక్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, నాయకులు, తదతరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సరస్వతినగర్‌లోని కపిల్ బాలకుటీర్‌లో ఉంటూ సరస్వతి శిశుమందిర్‌లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 12న నిర్వహించే స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించామని సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. యావత్ ప్రపంచానికి దిశానిర్దేశం చేసి ఎంతోమందికి ఆదర్శప్రాయుడిగా నిలిచిన మహోన్నత వ్యక్తి వివేకానందుడని అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ధనపురి సాగర్, బాలకుటీర్ మేనేజర్ గీకూరి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాముడి అక్షింతలు పంపిణీ

కొత్తపల్లి: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారు పంపిన పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం సీతారాంపూర్‌లోని సూర్యనగర్‌కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటింటా..

కరీంనగర్‌రూరల్: దుబ్బపల్లి, తీగలగుట్టపల్లిలో ఆదివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. రామ జన్మభూమి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు శ్రీరాముడి చిత్రపటం, అక్షింతల కలశంతో తీగలగుట్టపల్లిలోని మానికేశ్వరీనగర్, అన్విత గార్డెన్ ఏరియాలో రామనామం జపిస్తూ ఇంటింటా తిరుగుతూ అక్షింతలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గాండ్ల శ్రీనివాస్, రంగారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయానికి విరాళం



సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో శ్రీమార్కండేయ ఆలయ నిర్మాణానికి కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి నాగరాజు ఆదివారం రూ. 10,116 విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుంటుక లింగయ్య, ఆంజనేయులు, కేశవులు, చక్రపాణి, మల్లేశం, వెల్దండి శ్రీనివాస్, రాజు, పరమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



చొప్పదండి: ఆభరణాల పెట్టెలతో అయ్యప్ప భక్తుల ఊరేగింపు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయం తొమ్మిదో వార్షికోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఆభరణాలతో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ ఆశీర్వాదాలు అందించారు. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, కమిటీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్, రాజశేఖర్ రెడ్డి, సత్యానందం, వెంకటన్న రాజు, హరికృష్ణ, మునీందర్, సత్యం, మల్లేశం, భాస్కర్, సుధాకర్ గౌడ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ



మానకొండూర్: అక్షింతల ఊరేగింపులో భక్తులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లి గ్రామాలలో అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అవకాశాన్ని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ల వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గడ్డి గణేశ్, ఎదులాపురం అశ్వన్‌తేజ్, తంశెట్టి రాజేశ్, సాయిరి రమేశ్, రమణారెడ్డి, భాస్కరాచారి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థినులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1994–95 పదో తరగతి విద్యార్థులు ఒకచోట కలిసి చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. ఏ ఆపద వచ్చినా అందరం సహకరించుకుందామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నడిగట్టు తిరుపతి, ఉపాధ్యాయులు రాంచంద్రం, చీకోటి రమణయ్య, లక్ష్మణాచారి, రవీందర్, శివప్రసాద్, సుహాసిని, పూర్వ విద్యార్థులు గట్టు ఎల్లయ్య, మొలుగూరి సంపత్, నాగరాజు, అంజిరెడ్డి, ఎల్లయ్య, మోహన్‌దాస్, కూన సంపత్, రాముశ్రీహరి, వరలక్ష్మి, స్వప్న, జయశ్రీ, సులోచన, మావురవ్వ, రమాదేవి పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన



శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శిస్తున్న విద్యార్థులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్యా, వైజ్ఞానిక, విహార యాత్రకు వెళ్లారు. శని, ఆదివారం నిజామాబాద్ జిల్లాలోని బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గోదావరి నది, మహంకాళి అమ్మవారి ఆలయం, వ్యాసమహర్షిగుహ, గంగామాత ఆలయాలను సందర్శించినట్లు హెచ్ఎం లక్ష్మణ్‌రావు తెలిపారు. అలాగే శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించి లక్ష్మీ, సరస్వతి కెనాల్‌లకు నీటి విడుదలను పరిశీలించారు. ప్రాజెక్టు 42 గేట్లను విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు. అక్కడ తయారయ్యే జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. మళ్లీ నిర్మల్ జిల్లాలోని కొయ్యబొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యా, వైజ్ఞానిక, విహార యాత్రలో ఉపాధ్యాయులు కానిగంటి రాజమౌళి, శ్యామయ్య, శంకర్, ప్రతిమ, చంద్రశేఖర్, శ్రీనివాస్ పలువురు ఉన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అమెరికా వైద్యుడు నేరెళ్ల దామోదర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ కంకణాల శ్రీలత సురేందర్‌రెడ్డి శిబిరానికి అవసరమైన ఏర్పాట్లు చేయగా ప్రముఖ వైద్యులు శిబిరానికి వచ్చిన దాదాపు200 మందికి గుండె సంబంధిత, జనరల్, పీడియాట్రిక్, మధుమేహం, జనరల్, వివిధ అనారోగ్యసమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ దామోదర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గతంలో అమెరికా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యుల సహకారంతో సొంతగ్రామం మడిపల్లిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించామని తెలిపారు. తన పర్యవేక్షణలో ఇండో అమెరికన్ ఫిజిషియన్ ఆర్గనైజేషన్ సంస్థ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటస్వామి, రామ్‌కిరణ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, బ్రహ్మానందం, సాయిన వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, జడల శ్రీనివాస్, శ్రీనివాస్, ఎం.శ్రీదేవి కళ్యాణి, ఇల్లందకుంట పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

విద్యానగర్(కరీంనగర్): క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని జిల్లా మహిళ, శిశు సంక్షేమాధికారి సరస్వతి అన్నారు. కరీంనగర్ జగిత్యాల రోడ్‌లోని ది ప్లే స్కూల్‌లో ఆదివారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నారుల ఆటాపాట అలరించాయి. చిన్నారుల తల్లిదండ్రులకు కూడా వివిధ ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో కీర్తి రాజీవీరు, పాఠశాల చైర్మన్ పోల్సానీ సుధాకర్‌రావు, కార్యదర్శి రమాదేవి, ప్రిన్సిపాల్ ప్రభాదేవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై సర్వే

- వివరాలు సేకరిస్తున్న ఏఈవోలు
- క్రాప్‌బుకింగ్ యాప్‌లో నమోదు



గోపాల్‌పూర్‌లో పంటల సర్వే చేస్తున్న ఏఈవో పైడితల్లి

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ పంటల సాగు వివరాల నమోదు ప్రక్రియను వ్యవసాయాధికారులు ప్రారంభించారు. గత నెల 28 నుంచి ఈ నెల 6వరకు ప్రజాపాలన గ్రామసభలుండటంతో పంటల సాగు వివరాల సేకరణను ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం నుంచి కరీంనగర్ మండలంలో పంటల సాగు వివరాలను ఏఈవోలు స్వర్ణలత, అనుజ్ఞ, ప్రణయ్, పైడితల్లి సేకరిస్తున్నారు. తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల వద్దకు ఏఈవోలు వెళ్లి వివరాలను క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

పొలం వద్దకు వెళ్తేనే..

క్రాప్ బుకింగ్ కోసం ఏఈవోలు ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్‌లో ఏఈవో యాప్ పొలం వద్దకు వెళ్తేనే పనిచేస్తోంది. పొలానికి దాదాపు 50 మీటర్ల దూరం వెళ్తే రైతుల పేర్లు, సర్వే నంబర్ల వివరాలు యాప్‌లో కన్పిస్తాయి. రైతు వారీగా ఏ పంట సాగు చేశారు, యే రకం విత్తనం వేశారు, సాగునీటి సౌకర్యం తదితర వివరాలను నమోదు చేస్తారు. ఇప్పటివరకు మొత్తం 740 మంది రైతులకు చెందిన 963 ఎకరాల్లోని పంటల వివరాలను క్రాప్‌బుకింగ్ యాప్‌లో నమోదు చేశారు. చామనపల్లి క్లస్టర్ పరిధిలో 109 మంది రైతులకు చెందిన 142 ఎకరాలు, దుర్శేడ్ పరిధిలో 393 రైతుల 507 ఎకరాలు, మొగ్దుంపూర్‌లో 217 రైతుల 286, నగునూరులో 21మంది రైతులకు చెందిన 27.10 ఎకరాలున్నాయి.

యాసంగిలో సాగయ్యే పంటల వివరాలు

పంట	ఎకరాలు
వరి	12,185
మొక్కజొన్న	275
పెసర	10
కందులు	24
కూరగాయలు	285

పక్కాగా వివరాలు నమోదు

సర్వే నంబర్లవారీగా పంటల వివరాలను క్రాప్ బుకింగ్ యాప్‌లో పక్కాగా నమోదు చేయడం జరుగుతోంది. క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఏఈవోలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

– బి.సత్యం, మండల వ్యవసాయ అధికారి

అఖిల భారత సమాఖ్య ఉపాధ్యక్షుడికి సన్మానం

కరీంనగర్ అర్బన్: అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌ను పశుసంవర్ధక శాఖ అధికారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సదరు శాఖ కార్యాలయంలో డీవీహెచ్‌వో డా.బండారి నరేందర్, ఏడీ వై.జయరాములు, ఆఫీస్ మేనేజర్ మహేందర్, గూడ ప్రభాకర్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

కరీంనగర్‌టౌన్: తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానా) ఆధ్వర్యంలో భగత్‌నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం తానా ప్రతినిధులు ప్రారంభించారు.